పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం

- వైద్యం కోసం పేదవాడు అప్పుల పాలయ్యే పరిస్థితి రాకూడదన్నదే సీఎం జగన్ ఆలోచన
- 2,513 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద 3,257 వ్యాధులకు చికిత్స
- 6వవార్డులో స్మార్ట్‌కార్డులు పంపిణీ చేసిన నిసార్‌అహ్మద్


ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్న నిసార్‌అహ్మద్, మనూజారెడ్డి తదితరులు

మదనపల్లె : పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయం అని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తెలిపారు. ఏ పేదవాడు వైద్యం కోసం అప్పులు కాకూడదని, దేశంలో ఎక్కడా లేని విధంగా పేదవాడికి ఖరీదైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు సీఎం పెంచారన్నారు. శుక్రవారం పట్టణంలోని 6వవార్డులో కౌన్సిలర్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్‌మాట్లాడుతూ...పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువస్తే... దానికి మరిన్ని మెరుగులు దిద్దుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ క్రమంలో ఆరోగ్యశ్రీలో 3,257 వ్యాధులకు చికిత్సలు అందించడంతో పాటుగా 2,513 ఆస్పత్రుల్లో...ముఖ్యంగా హైదరాబాదు, బెంగళూరు, చెన్నైలోని ఆస్పత్రుల్లోనూ సేవలను విస్తరింపజేశారన్నారు. ఏడాదికి రూ.5 లక్షల ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నారన్నారు. దేశంలో ప్రజాసంక్షేమానికి, విద్య, వైద్యంకు ఇంత పెద్దమొత్తంలో నిధులు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదవాడికి మంచి జరుగుతుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకున్నారన్నారు. ప్రజలందరికీ మంచి జరిగిఉంటేనే తనకు ఓటువేయమని అడుగుతున్న దమ్ము, ధైర్యం కలిగిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రి, 30 ఏళ్ల అనుభవం అని చెప్పుకునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన పాలనలో పేదవాడికి ఎందుకు మేలు చేయలేకపోయారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించి, జగనన్న నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్ బాబు, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, భాను, ఎం.వి.రమణ, రామిశెట్టిశివయ్య, ఈశ్వరనాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, పసుపురవి, సాయిశేఖర్‌రెడ్డి, నరిబాబాయ్, సలీం, ఎల్‌ఐసీ.సుధాకర్, చరణ్, వేణుగోపాల్, వై.రెడ్డిప్రసాద్, టి.రెడ్డెప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

రామసముద్రం: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కురిజల గ్రామంలో సర్పంచ్ మంగమ్మ అధ్యక్షతన భూహక్కు, భూరక్ష పట్టా పాసుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. లబ్ధిదారులకు భూమిపై హక్కు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. తాను ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని , తన కుటుంబం కూడ రైతు కుటుంబమేనని , రైతుల కష్టాలు నేరుగా చూసినవాడనని తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తనపై చూపుతున్న ఆదరణ వెలకట్టలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్‌గౌడ్, మండల కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి, నాయకులు దొడ్డిపల్లి ఆనంద, గెవన్న, జయరామిరెడ్డి, సిహెచ్ ప్రకాష్, రాధారెడ్డి, అంజిరెడ్డి, మస్తాన్, తిమ్మారెడ్డి, బిసి సెల్ కార్యదర్శి బాలాజి, సర్పంచ్‌లు చరణ్, ఆదినారాణ, రెడ్డెప్పనాయుడు, ఎంపీటీసీ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పునాదులు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: కార్యకర్తలే పార్టీకి పునాదులు. వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించేందుకు ప్రతి కార్యకర్త పార్టీకి కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డితో కలసి బూత్ కన్వీనర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పని చేసినప్పుడే కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త ప్రతి గడపకు వెళ్లి జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయాలన్నారు. వలంటీర్ల వ్యవస్థ ఉంటేనే ఇంటి వద్దకు సంక్షేమ పథకాలు వస్తాయని, సచివాలయాలతోనే గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకట్రమణ, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, నాయకులు నీళ్లభాస్కర్, రాయుడు, ఆనంద, రెడ్డి అర్జున్ రెడ్డి, రవి, సురేష్‌రెడ్డి, చిన్నా, శివారెడ్డి, లక్ష్మినారాయణ, రమేష్, రవీంద్ర రెడ్డి, నాగరాజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.లక్ష విరాళంగా అందిస్తున్న పీఏ శ్రీనివాసులు

వాల్మీకిపురం: మండలంలోని గండబోయనపల్లి జామియా మసీదులో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఏపీఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి సొంత నిధులతో రూ.లక్ష విరాళంగా ముతవల్లీకి అందించారు. శుక్రవారం లక్ష రూపాయల నగదును ఆయన పీఏ శ్రీనివాసులు అందించారు. ముస్లింలు పెళ్లిలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాలనుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ షరీఫ్, వల్లీ, షామీర్, మక్బుల్ సాబ్, ఖాసీం సాబ్, అల్లాబక్షు, సంజీవ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, ఉత్తన్న, భాస్కర్‌రెడ్డి, చిన్నా, మౌల, ఖాదర్ బాషా, అమాన్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో చలువపందిళ్ల, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు ఆకట్టుకొంది. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్ బాబు

నిమ్మనపల్లె : ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం బండ్లపై సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని సర్పంచు వెంకటరత్న, నాయకులు చంద్రమోహన్, వైస్ ఎంపీపీ జయప్రకాశ్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి భరోసామిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం కావడంతో, రెండవ విడతలో మరింత ఎక్కువమందికి వైద్య సేవలు అందించాలని మరోమారు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరం లో 406 మంది వైద్య సేవలు అందించారు. అవసరమైన మందులను, కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి ప్రణీత్, నాయకులు , వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మారెప్ప, సరస్వతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోటలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో నలుగురు వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారుగా 150 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పోలప్ప, సర్పంచ్ వియమ్మ, డాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై బీఎల్వోలతో సమీక్ష

పెద్దతిప్పసముద్రం: నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర శుక్రవారం పీటీఎంలో ములకలచెరువు, బి.కొత్తకోట పెద్దతిప్పసముద్రం మండలాల్లోని బీఎల్వోలు, తహసీల్దార్లతో ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే చేపట్టాల్సిన అంశాలను క్షుణంగా విశదీకరించారు. ప్రధానంగా కోడ్ అమల్లోకి రాగనే గ్రామాల్లో ఎక్కడా ఏ రాజకీయ పార్టీకి సంబంధించి పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు ఉండరాదని, విగ్రహాలకు ముసుగు వేయాలని సూచించారు.

ఈ-క్రాప్ నమోదు వందశాతం పూర్తి

పీలేరు రూరల్ : 2023-24లో రబీ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు వందశాతం పూర్తి చేసినట్లు ఏడీఏ వై.వి. రమణరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు మండలంలో 1548 ఎకరాల్లో, కేవీపల్లె మండలంలో 1150 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారని తెలిపారు. ఈ రెండు మండలంలో 99 శాతంకు పైగా ఈకేవైసీ పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ పంటకు సంబంధించి శుకరవారం నుంచి మూడు రోజుల పాటు సామాజిక చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేలో రైతుల జాబితా ప్రదర్శించడం జరిగిందని, రైతులు సరిచూసుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆర్‌బీకేలలో తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్టీయూ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు


ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

కలికిరి: కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత నెలలో న్యాక్ టీం జేఎన్టీ యూనివర్సిటీ అనంతపురం, అనుబంధ కళాశాలల్లో పర్యటించిందని, యూనివర్సిటీతో పాటు కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలు, బోధనాతీరు, పరిశోధన విభాగాలు, ఇతర మౌలిక వసతులపై టీం పరిశీలించి నివేదిక ఆధారంగా యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు న్యాక్ ఏ గ్రేడ్ ప్రకటించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. న్యాక్ గ్రేడ్‌తో కళాశాల అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూరుతాయని, ఇక్కడ చదివే విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, ఉద్యోగ అవకాశాలలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

3న ఓ భారతీయుని ప్రేమ కథ నవలిక ఆవిష్కరణ

మదనపల్లె సిటీ: ప్రముఖ రచయిత, రిటైర్డు ఇరిగేషన్ ఈఈ పి.వి.ప్రసాద్ రచించినప ఓ భారతీయుని ప్రేమ కథ నవలిక ఈనెల 3న ఆవిష్కరిస్తున్నట్లు మ.ర.సం కార్యదర్శి లింగాల యుగంధారాచారి తెలిపారు. స్థానిక బెంగుళూరురోడ్డులోని మరసం కార్యాలయంలో సాయంత్రం 4.30 గంటలకు ఆవిష్కరిస్తామన్నారు. అలాగే మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా రచయితలకు ఆత్మీయ సత్కారాలు నిర్వహిస్తామన్నారు. సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ పోలప్ప

ములకలచెరువు: ప్రజా సస్యలరిష్కారానికి అధికారుల కృషి చేయాలని ఎంపీపీ సాయిలీలా అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ రీసర్వే, ఇంటి పట్టాల మంజూరులో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. వేసవి కాలం కావడంతో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతి కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో అక్కడక్కడా తాగునీటి బోర్లకు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ రామలక్ష్మణ్ అన్నారు.

తప్పులు లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

పీలేరు : పీలేరు అసెంబ్లీ 163 నియోజకవర్గంలో తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎన్నికల నమోదు అధికారి ఎస్. రమా అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫారం 6, ఫారం 7, ఫారం 8లో వచ్చిన దరఖాస్తులను డోర్ టు డోర్ వెళ్లి పరిశీలించాలన్నారు. చినపోయిన వారు, ఊరు వదలి వెళ్లిన వివరాలు సరైనవిగా గుర్తించాలని ఆదేశించారు. తహశీల్దార్‌లు ఎస్. మహబూబ్‌బాషా, ప్రదీప్, ఖాతిజాన్‌కుప్రా, నయాజ్‌అహ్మద్, డీటీలు విజయ్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఏఎస్‌వో రామ్మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


తాటిమాకులపల్లెలో గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం: అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాం..గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టాం.. ప్రతిపల్లెకు రోడ్డు సౌకర్యం కల్పించాం.. అభివృద్ధి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. మండంలోని కోటకాడపల్లె పంచాయతీలోని యర్రసానివారిపల్లె, తాటిమాకులపల్లెలో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా యర్రసానివారిపల్లె లో ఎంపీటీసీ బోడెం రవితేజ సోదరుని వివాహానికి ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం గడప గడపకు కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, గ్రామాలలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. పేదలకు సంక్షేమ పథకాలు, గ్రామాలలో మరింత అభివృద్ధి జరగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. తాటిమాకులపల్లెకు పై భాగంలో హంద్రీ-నీవా కాలువకు అనుసంధానంగా నిర్మించిన వొడుపుచెరువు తూముకు గేటు అమర్చాలని, అలాగే మొరవ నిర్మించాలని రైతులు ఎమ్మెల్యేని కోరారు. అనంతరం కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద ముస్లిం సోదరులతో కలిసి ఫాతెహా నిర్వహించారు. మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, ఆర్‌బికే ఛైర్మన్ చాను, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, జింకా విశ్వనాథ, పద్మావతమ్మ, భూదేవి, ఎంపీటీసీ మంచూరి జయరాం, వాటర్‌షెడ్ కమిటి ఛైర్మన్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోనాల మధు, ప్రతాప్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, శంకరరెడ్డి, యర్రగుట్టపల్లె మధూకర రెడ్డి, మాజీ సర్పంచ్ నజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నిరాణకు చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక

పెద్దమండ్యం: వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు అభివృద్ధి పనుల గురించి సమావేశంలో వివరించారు. మండలంలో 696 మంది రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పంపిణీ చేసినట్లు ఏఈ తెలిపారు. అలాగే మండలంలో 2100 కుటుంబాలు 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్‌ను వినియోగించుకున్నట్లు చెప్పారు. లోవోల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిహెచ్‌వో క్రిష్ణయ్య తెలిపారు. మండలంలో 30 కేంద్రాలను ఏర్పాటు చేసి 0 నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలీయో చుక్కలు వేస్తారని చెప్పారు. 7,340 మంది రైతులకు రైతు భరోసా వచ్చినట్లు ఏవో సురేష్‌బాబు తెలిపారు. అలాగే 10,020 మంది రైతులకు సున్నావడ్డీ కింద రూ. 24.10 లక్షలు వచ్చినట్లు తెలిపారు. అలాగే ఖరీఫ్‌లో రైతులకు రాయితీ వేరుశెనగ విత్తనాల పంపిణీ కోసం అధికారులకు నివేదించినట్లు తెలిపారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలలో సమస్య పరిష్కారం కోసం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దృష్టికి తీసుకుపోయి కొత్తగా బోర్లు వేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఏఈ తెలిపారు. అలాగే కొళాయిల ఏర్పాటు కోసం జలజీవన్ మిషన్ ద్వారా పైపులైన్లు వేస్తున్నట్లు చెప్పారు. వేసవిలో పశుగ్రాసం కొరతను ఎదుర్కొనేందుకు 400 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అవసరమని నివేదించినట్లు వెటర్నరీ డాక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రతిపల్లెకు తారు రోడ్డు, సిమెంటు రోడ్డు నిర్మాణాలు ముడు దశలలో చేపట్టినట్లు ఏఈ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీఓ వెంకటరమణయ్య, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ట్రాన్స్‌కో ఏఈ శంకరరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరిప్రసాద్, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులురెడ్డి, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, జింకా విశ్వనాథ, సోదనపల్లె బాషా, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న సీఐఏటీ-3, సీఆర్‌ఫీఎఫ్ అధికారులు

మదనపల్లె : ప్రశాంతమైన శారీరక, మానసికోల్లాసానికి విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడాపోటీలు ఎంతో అవసరమని రిటైర్డ్ బ్రిగేడియర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సీఐఏటీ-3, సీఆర్‌పీఎఫ్, కలికిరికి చెందిన అనుపమ్‌శర్మ, కమాండర్ రాజేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిలకవారిపల్లె ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో ఛాంపియన్ కార్నివాల్ పేరుతో ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన అనుపమ్ శర్మ, రాజేష్‌కుమార్‌లు ఆటల పోటీలను ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. క్రీడాభివృద్ధితోనే దేశానికి ప్రత్యేక గుర్తింపు వస్తోందన్నారు. ప్రపంచ ఒలింపిక్స్‌లో భారతదేశానికి తక్కువ సంఖ్యలో పతకాలు వచ్చేవని, ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, క్రీడాకారులను ప్రోత్సహిస్తుండటంతో ఒలింపిక్స్ పోటీల్లో భారతదేశం అధికసంఖ్యలో పతకాలను కైవసం చేసుకుందన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలో ప్రావీణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


వాల్మీకిపురంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరైన విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మదనపల్లె పట్టణంలో 11 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభమైంది. మొదటి సంవత్సరం సంస్కృతం, ఉర్దూ,హిందీ, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బందిని నియమించారు. పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను కస్టోడియన్ ఆఫీసర్ బాలకృష్ణమూర్తి పలు కాలేజీలను పరిశీలించారు. అలాగే పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడ, వాల్మీకిపురం, కేవీపల్లె, గుర్రకొండలో ఇంటర్‌పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, కురబలకోటలో ఇంటర్ పరీక్షలను అధికారులు పకబ్బందీగా నిర్వహించారు. ఎక్కడా సమస్యలు తల్తెతకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో కూడా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

క్లుప్తంగా

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

కలకడ : గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని గంగాపురం సర్పంచ్ రామచంద్ర తెలిపారు. ఎంపీ పీవి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి చొరవతో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, త్రీ ఫేస్ లైన్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం మండలంలోని గంగాపురం పంచాయతీ కత్తివారిపల్లె గ్రామానికి అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, నూతన విద్యుత్ స్తంభాలు, త్రీ ఫేస్ విద్యుత్ లైన్ సర్వీస్‌లను ఏఈ వరప్రసాద్, లైన్‌మెన్ ఆనంద్‌నాయక్ సిబ్బందితో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జానకిరామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, శివరాం, ఆంజనేయులు, శ్రావన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నిమ్మనపల్లె పంచాయతీ నాగులయ్యగారిపల్లె సమీపంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో.. సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. స్థానికుడైన వెంకటరమణ అలియాస్ చిన్నబిడ్డ సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బి.కొత్తకోట: కర్ణాటకలోని గొనిపల్లెకు చెందిన జీకే.మహమ్మద్‌రఫీ మండలంలోని కనికల తోపు రైల్వే ట్రాక్ వద్ద మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేశామని ఏఎస్ఐ బొజ్జేనాయక్ శుక్రవారం తెలిపారు. ఇతని నుంచి 144 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని తెలిపారు.

అమరులకు కొవ్వొత్తులతో నివాళి

బి.కొత్తకోట: ఎస్సీల వర్గీకరణ ఉద్యమంలో అమరులైన ఉద్యమకారులకు శుక్రవారం రాత్రి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ముచిన్నా మాట్లాడుతూ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని గాంధీ భవన్ ముట్టడికి ప్రయత్నించగా జరిగిన ఘటనలో కార్యకర్తలు అమరులయ్యారని అన్నారు. దశాబ్దాల ఉద్యమం తర్వాత వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వంలో కదలిక వచ్చిందని వర్గీకరణ ఫలాల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భవానీ వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ ఈశ్వర్, చౌడప్ప, మంజునాథ్, బాలు, నవీన్, ఆకాష్, విజయకుమార్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.30 వేలు వితరణ

కలకడ : మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకోటమిట్ట ఆంజనేయస్వామి గర్భగుడి నిర్మాణ అభివృద్ధికి అదే పంచాయతీకి చెందిన రమణయ్య రూ.30001 విరాళం అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వీరభద్ర తెలిపారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రమణయ్య భార్య శ్యామలమ్మ జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణంలో పాలు పంచుకుంటున్నట్లు రమణయ్య తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మదనపల్లె సిటీ: ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఒంటిమిట్టపల్లెలో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు, స్వచ్ఛభారత్, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీటిని స్థానిక సర్పంచు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి అరుణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు మంజు,బాలాజీ పాల్గొన్నారు.

మార్చి 4లోపు పంట నమోదు పూర్తి చేయండి

వాల్మీకిపురం: రైతులు పండించిన పంటలకు మార్చి 4వ తేదిలోపు ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని వాల్మీకిపురం వ్యవసాయ శాఖ ఏడీఏ వాణిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు ఫిబ్రవరి 28వ తేది గడువు ముగియడంతో, ప్రభుత్వం మళ్లీ మార్చి 4వ తేది వరకు పొడిగించిందన్నారు. ప్రతి రైతు వారు పండించిన పంటలను ఆయా పంచాయతీల్లోని ఆర్‌బీకే కేంద్రాలకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

ఎన్‌సీసీ అధికారి అవార్డు అందుకున్న దేవకమ్మ

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులురాలుగా పని చేస్తున్న దేవకమ్మకు ఉత్తమ ఎన్‌సీసీ అధికారి అవార్డు లభించింది. శుక్రవారం సికింద్రాబాద్‌లోని ఎన్‌సిసి ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ జనరల్ ఎంఎస్ రెడ్డి చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రం అందుకున్నారు. ఎస్టీయూ నాయకుడు ఆర్.వి.రమణ, ఉపాధ్యాయులు పఠాన్ మహమ్మద్‌ఖాన్, ముబారక్ బాషా, నాగరాజు, మిట్టపల్లి సుధాకర్‌రెడ్డి, పుణ్యవతి తదితరులు దేవకమ్మను అభినందించారు.